
మున్సిపల్ సిబ్బందితో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

## పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలి

**మున్సిపల్ కమిషనర్ ఖాజామొయిజుద్దీన్**

మొయినాబాద్, ఫిబ్రవరి 6: పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించాలని తాగునీటి సమస్య రాకుండా చూడాలని మొయినాబాద్ మున్సిపల్ కమిషనర్ ఖాజామొయిజుద్దీన్ అన్నారు. గురువారం అజీజ్‌నగర్ మున్సిపాలిటీ కార్యాలయం వద్ద మున్సిపల్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రోడ్లు, మురుగు కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఎండాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో మంచినీటి సరఫరాపై సిబ్బంది సమస్యలు రాకుండా చూడాలని చెప్పారు. విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని, వెంటనే వీధి దీపాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అధికాలలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలను పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

షాద్‌నగర్‌రూరల్, ఫిబ్రవరి 6: ప్రైవేట్ పాఠశాలలు, ప్రభుత్వ గురుకులాలు, వసతి గృహాల్లో ప్రభుత్వ నిబంధనలను పాటించని వారిపై సర్కార్ కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ జాగృతి షాద్‌నగర్ తాలుకా మాజీ కన్వీనర్ ముస్తాఫా అన్నారు. ప్రధానంగా ఇటీవలే గురుకుల విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, వీటిపై ఎలాంటి విచారణ జరపకుండా ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబించడం సరికాదన్నారు. విద్యార్థుల ఆత్మహత్యలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. విద్యావ్యవస్థలో మార్పులు తీసుకురావాలన్నారు. అదే విధంగా మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ వసతి గృహంలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని కుటుంబ సభ్యులకు ప్రభుత్వం అండగా నిలువాలని, వారికి రూ. 50లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు.

# అధ్వానంగా పారిశుధ్యం

**పొంగిపొర్లుతున్న భూగర్భ డ్రైనేజీ**
**దుర్గంధం వెదజల్లుతున్న వైనం**
**పట్టించుకోని ప్రత్యేక అధికారులు**

యాచారం, ఫిబ్రవరి 6: మండలంలోని నానక్‌నగర్ గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. ప్రత్యేక పాలనలో గ్రామంలో పారిశుధ్యం పూర్తిగా పడకేసింది. పాలకుల నిర్లక్ష్యంతో మురుగు కాల్వలు, భూగర్భ డ్రైనేజీ పొంగి పొర్లుతూ ఏరులై పారుతున్నవి. రోడ్లపై పారుతున్న మురుగు ప్రజల ముక్కుపుటలదిరేలా దుర్గంధం వెదజల్లుతున్నది. ముఖ్యంగా గ్రామంలోని 6వ వార్డులో అండర్ డ్రైనేజీ వ్యవస్థ ఒక్కసారిగా స్తంభించిపోవడంతో మెయిన్ వాల్వ్‌ల నుంచి మురుగు నీరు పొంగి పొర్లుతూ రోడ్లపై, ఇండ్ల మధ్యలో ప్రవహిస్తున్నది. డ్రైనేజీకి మరమ్మతులు చేసే నాథుడే లేకపోవడంతో పారిశుధ్య సమస్యలు రెట్టింపయ్యాయి. ముఖ్యంగా ఈగలు, దోమలు విజృంభించి ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారని వాపోతున్నారు. పారిశుధ్య సమస్యలపై అధికారులు దృష్టి సారించి ప్రజారోగ్యాన్ని పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.


ఇండ్ల మధ్య ఏరులై పారుతున్న మురుగునీరు

**పారిశుధ్య సమస్య వెంటనే పరిష్కరించాలి**



గ్రామంలో నెలకొన్న పారిశుధ్య సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలి. ముఖ్యంగా ఆరో వార్డులో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. డ్రైనేజీ నిండి రోడ్లపై, ఇండ్ల మధ్యన పారుతుంది. దీంతో విపరీతమైన దుర్వాసన వస్తుంది. అధికారులను ఆశ్రయిస్తే నిధులు లేవనే సాకుతో సమస్యను పట్టించుకోవడంలేదు. ఉన్నత స్థాయి అధికారులు స్పందించి వెంటనే పారిశుధ్య సమస్యలను పరిష్కరించాలి.

- కొప్పు రవి, నానక్‌నగర్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

# నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

**ఎమ్మెల్యే కాలె యాదయ్య**

షాబాద్, ఫిబ్రవరి 6: ప్రభుత్వం నుంచి అధిక నిధులు తీసుకువచ్చి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గంలోని ఐదు మండలాలకు సంబంధించి ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల నుంచి రూ.10.40కోట్లు నిధులు మంజూరైనట్లు తెలిపారు. అభివృద్ధిలో భాగంగా పలు గ్రామాల్లో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణానికి ముఖ్యమంత్రి ఆదేశాలతో మంత్రి సీతక్క చొరవతో నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ నిధులతో గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

**సీఎం సహాయనిధి చెక్కులు అందజేత**

చేవెళ్లటౌన్ : నియోజకవర్గంలోని చేవెళ్ల, మొయినాబాద్ మండలాలకు చెందిన 24మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే యాదయ్య సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా మంజూరైన రూ.11లక్షల 60వేల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో చేవెళ్ల మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ నర్సింహులు, చేవెళ్ల, ముడిమ్యాల, గుండాల పీఏసీఎస్ చైర్మన్లు వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బుచ్చిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు ఆగిరెడ్డి, టీపీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, డైరెక్టర్ జనార్దన్, రాములు నాయకులు నరేందర్ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లలో 5 శాతం కేటాయించాలి


ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న బంజారా దివ్యంగ్ ఐక్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు

ఆమనగల్లు, ఫిబ్రవరి 6: ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో దివ్యాంగులకు 5 శాతం కేటాయిస్తూ గతంలోనే జీవో జారీ చేసిందని ఆ జీవోను ఆమనగల్లు మండలంలో కూడా అమలు చేయాలని బంజారా దివ్యంగ్ ఐక్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాత్లావత్ రమేశ్‌నాయక్ ఆధ్వర్యంలో గురువారం ఎంపీడీవో కుసుమ మాధురిని కలిసి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో బంజారా దివ్యంగ్ ఐక్య సమితి రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ శ్రీనూనాయక్, నాయకులు విజయ్‌రాథోడ్, బిక్కు, రాములు ఉన్నారు.

## యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ రాజు

యాచారం, ఫిబ్రవరి6: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు సూచించారు. హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పీఎస్ పరిధిలోని తాటిపర్తి గ్రామంలో సైబర్ నేరాలు, డ్రగ్స్, గంజాయి తదితర అంశాలపై యువత, గ్రామస్తులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ రాజు మాట్లాడుతూ..సైబర్ క్రైమ్ నేరాలు, ఆన్‌లైన్ గేమ్స్, గంజాయి, మత్తు పదార్థాలు, మత్తు పానియాలు, ధూమపానం, పేకాట తదితర చెడు వ్యసనాలకు అలవాటు పడొద్దన్నారు. దోపిడీలు, దొంగతనాల పట్ల గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ తేజంరెడ్డి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

## అటవీ స్థలంలో సీసీ రోడ్డు నిర్మాణంపై ఫిర్యాదు


అటవీశాఖ అధికారికి ఫిర్యాదు చేస్తున్న మర్రిపల్లి వాసులు

పెద్దఅంబర్‌పేట, ఫిబ్రవరి 6: మున్సిపాలిటీ పరిధి మర్రిపల్లిలోని అటవీ స్థలంలో అక్రమంగా సీసీ రోడ్డు నిర్మించినవారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు జైహింద్, శోభన్‌గౌడ్ కోరారు. ఈ మేరకు ఫారెస్ట్ రేంజ్ అధికారికి గురువారం ఫిర్యాదు చేశారు. మర్రిపల్లి సర్వేనంబర్ 87లోని అటవీ స్థలంలో మున్సిపల్ నిధులతో సొంత వ్యాపారాల కోసం కొందరు వ్యక్తులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కిందిస్థాయి అటవీశాఖ అధికారులతో కుమ్మక్కయి అక్రమంగా రాత్రికి రాత్రి కంకర వేసి రోడ్డు పనులు ప్రారంభించారని తెలిపారు. దీనిపై గతంలోనే అటవీ అధికారులకు ఫిర్యాదు చేయగా పనులు ఆపేశారని పేర్కొన్నారు. కానీ, గత వారం రాత్రికి రాత్రే సీసీ రోడ్డు పనులు పూర్తి చేసేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మున్సిపల్ అధికారులతో మాట్లాడి రోడ్డుకు మంజూరైన నిధులను ఆపించాలని కోరారు. విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటాయని రేంజ్ అధికారి తెలిపారు.

## కలెక్టరేట్‌కు అదనపు బస్సు సౌకర్యం

ఆదిబట్ల, ఫిబ్రవరి 6: రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు హైదరాబాద్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సుచరిత స్పందించి మిధాని డిపో నుంచి రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌కు అదనపు బస్సు సౌకర్యాన్ని కల్పించారు. సాయంత్రం 6 గంటలకు కలెక్టరేట్ నుంచి బయలు దేరుతుందని తెలిపారు. ఈ బస్సు సౌకర్యం కల్పించినందుకు మంత్రి పొన్నం ప్రభాకర్, టీజీవో అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావుకు టీజీవో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కె రామారావు, కార్యదర్శి శ్రీనేశ్‌కుమార్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## బీఆర్‌ఎస్ సభను విజయవంతం చేయాలి

**బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాములు**

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 6 : అబద్ధాలతో కాలం వెల్లదీస్తున్న కాంగ్రెస్‌ను బొంద పెట్టేందుకు బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధం కావాలని ఇబ్రహీంపట్నం మాజీ ఎంపీపీ కృపేశ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బుగ్గరాములు అన్నారు. ఈ నెల 8న ఇబ్రహీంపట్నం శాస్త్రాగార్డెన్‌లో నిర్వహించే బీఆర్ఎస్ మండలస్థాయి సమావేశాన్ని విజయవంతం చేసేందుకు బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలిరావాలని కోరుతూ.. గురువారం మండల పరిధిలోని చర్లపటేల్‌గూడ, కప్పాడు, తుర్కగూడ, పోచారం, ఎలిమినేడు, తులేకలాన్‌తో పాటు పలు గ్రామాల్లో బీఆర్ఎస్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే బీఆర్ఎస్ మండలస్థాయి సమావేశానికి భారీగా శ్రేణులు తరలిరావాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందజేత

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 6 : బాటసింగారం రైతు సేవా సహకార సంఘంలో సభ్యుడైన తారామతిపేట గ్రామానికి చెందిన రైతు చేగూరి బాలయ్య గత నెల 21న మృతి చెందాడు. ఆయన భార్య చేగూరి కొమురమ్మకు మండల కేంద్రంలోని సంఘం ప్రధాన కార్యాలయంలో గురువారం చైర్మన్ చేగూరి భరత్‌కుమార్ యాదవ్ రూ. 25వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో పరిసర గ్రామాల నాయకులు జంగమయ్యయాదవ్, బాలకృష్ణ, సంజీవరెడ్డి, అకౌంటెంట్ రాకేశ్‌గౌడ్, రైతులు ఉన్నారు.


సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ గోనె ప్రతాప్ రెడ్డి

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

చేవెళ్ల రూరల్, ఫిబ్రవరి 6 : చేవెళ్ల మండల పరిధి ముడిమ్యాల్ గ్రామంలో రూ.15 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం పీఏసీఎస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కాలె యాదయ్య చొరవతో గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని, సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రాములు, మాజీ సర్పంచ్ ప్రభాకర్, బీఆర్ఎస్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, నాయకులు రాములు, రాజ్‌కుమార్, మాధవరెడ్డి, సాయినాథ్, శివకుమార్, జంగారెడ్డి, వాజిద్, శ్రీశైలం, ఖాజామోయినుద్దీన్, జనార్దన్, సత్యం, శంకర్‌గౌడ్, రాంచదయ్య, యాదయ్య పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థికి నులి పురుగుల మాత్రలు వేయాలి


మొయినాబాద్, ఫిబ్రవరి 6: పాఠశాలల్లో ప్రతి విద్యార్థికీ నులి పురుగుల మాత్రలు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి, మండల పరిషత్ అభివృద్ధి శాఖ అధికారి సంధ్య అన్నారు. ఈ నెల 10వ తేదీన జాతీయ నులి పురుగుల దినోత్సవ కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యంలో కార్యక్రమానికి సమాయత్తం కావడం కోసం గురువారం మండల పరిషత్ కార్యాలయంలో విద్యాశాఖ అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు, పంచాయతీరాజ్ అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1 నుంచి 19 ఏండ్ల వయస్సు పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు వేయాలని సూచించారు. 10వ తేదీన మాత్రలు వేయని వారికి 17వ తేదీన వేస్తారని తెలిపారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి అన్నపూర్ణ, మండల విద్యాధికారి వెంకటయ్య, ఎంపీవో వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీవో సంధ్య

## తాళం వేసిన ఇంట్లో చోరీ

ఆదిబట్ల, ఫిబ్రవరి 6: ఇంటికి తాళం వేసి తన తల్లిగారి ఇంటికి వెళ్లి వచ్చే సరికి ఇంటి తాళాలు పగుల గొట్టి బంగారు నగలతో పాటు నగదు ఎత్తుకెళ్లిన ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం నాదర్‌గుల్ గ్రామం, గ్రీన్ హోమ్స్ కాలనికి చెందిన ఎండీ ఫజులుల్ హక్ గత నెల 31న ఆమె ఇంటికి తాళం వేసి తన తల్లిగారి ఇంటికి నగరంలోని అత్తాపూర్‌కు వెళ్లింది. తిరిగి గురువారం ఉదయం తన ఇంటికి వచ్చి చూసే సరికి తలుపులు తెరిచి ఉన్నాయి. అల్మారా తెరిచి ఉంది. 4 తులాల బంగారం, 25 తులాల వెండి, కొంత నగదును దుండగులు ఎత్తుకెళ్లారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలువాలి


కళాశాలలో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

మొయినాబాద్, ఫిబ్రవరి 6 : ప్రజలు రక్తహీనతతో బాధ్యపడుతున్నారని రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలువాలని కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సాయిసత్యనారాయణరెడ్డి అన్నారు. మొయినాబాద్ మండల పరిధిలోని చిలుకూరు రెవెన్యూలోని కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎంఎన్ నర్సయ్య, అకాడమిక్ డీన్ ఉదయ్‌శ్రీ, డీఎస్‌ఏ డీన్ రత్నాచారి, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

యాచారం, ఫిబ్రవరి 6: ఆర్టీసీ బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రంలోని తిరుమలేశుని గుట్ట సమీపంలో నాగార్జునసాగర్ ప్రధాన రహదారిపై గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం నల్లగొండ జిల్లా కొండమల్లెపల్లి గ్రామానికి చెందిన సంతోశ్ (28) హైదరాబాద్ నుంచి కొండమల్లెపల్లికి తన ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. యాచారంలోని తిరుమలేశుని గుట్ట సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న దేవరకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు అతడి బైకును ఢీకొంది. ప్రమాదంలో సంతోష్ కాలు విరగడంతో పాటు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని 108 అంబులెన్స్‌లో నగరంలోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు. దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.



## కేంద్ర బడ్జెట్‌లో సామాన్యులకు నిరాశ

ఆమనగల్లు, ఫిబ్రవరి 6: కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ ప్రయోజనాలకు ఉపయోగపడేలా ఉందని సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య మండిపడ్డారు. మండల కేంద్రంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను నిరసిస్తూ కార్మికులతో కలిసి ఆయన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పెంటయ్య మాట్లాడుతూ సామాన్య ప్రజలకు లబ్ధిచేకూరేలా బడ్జెట్ లేదని, వ్యవసాయ రంగానికి, విద్య, వైద్య రంగాలకు ఆశించిన నిధులు కేటాయించలేదని ఆయన ఆరోపించారు. తెలంగాణకు నిధులు కేటాయించడంలో కేంద్రం పూర్తిగా వివక్ష చూపిస్తున్నదని ఆయన అన్నారు. రైతులకు ఉపయోగపడే ఎంఎస్‌పీ చట్టం తీసుకురాలేదని ఆయన దుయ్యబట్టారు. బడ్జెట్‌ను నిరసిస్తూ ఈ నెల 10న ఇందిరా పార్కు వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మహాధర్నాను నిర్వహిస్తున్నట్లు ఈ కార్యక్రమానికి కార్మికులు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు రవి, హంసమ్మ, విజయ, యాదమ్మ, అంజమ్మ పాల్గొన్నారు.

## ఘనంగా ఉర్సు


ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, ఎంపీపీ రవీందర్‌యాదవ్

నందిగామ, ఫిబ్రవరి 6: నందిగామ మండల పరిధిలోని చేగూరు గ్రామంలో హజరత్ సయ్యద్ నిజాం షాహిద్ ఉర్సు గురువారం ముస్లిం మత పెద్దలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్ పాల్గొని దర్గాలో ప్రార్థనలు చేశారు. వారి వెంట సర్పంచ్‌ల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, చేగూరు పీఏసీఎస్ చైర్మన్ అశోక్, మాజీ చైర్మన్ విఠల్, మాజీ సర్పంచ్ అశోక్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## భారత్ గౌరవ పురస్కార్ ప్రదానం



కడ్తాల్, ఫిబ్రవరి 6: కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్ వ్యవస్థాపకుడు లీలమ్మ, లక్ష్మారెడ్డి భారత్ గౌరవ పురస్కార్‌ను అందుకున్నారు. కర్ణాటక రాష్ట్రంలోని కలబుగిరి జిల్లా సేడం పట్టణంలో భారత్ వికాస్ సంగం ఆధ్వర్యంలో నిర్వహించిన భారతీయ సంస్కృతి ఉత్సవ్-7 కార్యక్రమంలో వారు పురస్కారాన్ని అందుకున్నారు. పచ్చదనాన్ని పెంపొందిచడంతోపాటు భవిష్యత్ తరాలకు అందమైన ప్రకృతి అందించాలనే సంకల్పం, సీజీఆర్ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలకు గానూ.. భారత్ గౌరవ పురస్కార్‌ను పద్మశ్రీ మంజమ్మ జోగాతి నుంచి అందుకున్నట్లు వారు తెలిపారు. సీజీఆర్ సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను భారత్ వికాస్ సంగం అధ్యక్షుడు గోవిందాచార్య, బసవరాజ్ పాటిల్ ప్రశంసించినట్లు వారు తెలిపారు.

## రిజర్వేషన్లు కల్పించే వరకు ఉద్యమిస్తాం


మొయినాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మొయినాబాద్, ఫిబ్రవరి 6 : హైదరాబాద్‌లో తలపెట్టిన లక్ష డప్పులు.. వెయ్యి గొంతుకలు.. కార్యక్రమానికి సమాయత్తం చేయడానికి మొయినాబాద్ మండల కేంద్రంలోని హైదరాబాద్- బీజాపూర్ జాతీయ రహదారిపై ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మహేందర్ ఆధ్వర్యంలో డప్పులు మోగిస్తూ ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నేతలు మాట్లాడుతూ రిజర్వేషన్లు కల్పించే వరకు ఉద్యమిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాదిగ, రాష్ట్ర ప్రధానకార్యదర్శి శంకర్, జయవంత్, ఆంద్రూ, రాజు, రవికుమార్, సీహెచ్ రాజు, కె.శ్రీధర్, నర్సింగ్‌రావు, ప్రకాశ్, దర్శన్ పాల్గొన్నారు.

## ఫారెస్టు అధికారులకు నెమలి అప్పగింత

కేశంపేట, ఫిబ్రవరి 6: గాయపడిన నెమలిని లింగంధనకు చెందిన శేఖర్‌గౌడ్ గుర్తించి గురువారం ఫారెస్టు అధికారులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే మండలంలోని లింగంధన వ్యవసాయ పొలాల్లో శేఖర్‌గౌడ్ నెమలి గాయపడి ఉండడాన్ని గుర్తించి దానికి ప్రథమ చికిత్స చేశాడు. గ్రామానికి చెందిన మధుసూదన్‌గౌడ్ సాయంతో ఆయన ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి వచ్చిన ఫారెస్టు రేంజ్ అధికారి ఎండీ జాకీర్‌హుస్సేన్ నెమలిని తన వెంట తీసుకొని వెళ్లాడు. నెమలి ఆరోగ్యం మెరుగైన తర్వాత అడవిలో వదిలిపెట్టనున్నట్లు ఫారెస్టు అధికారులు తెలిపారు. వారి వెంట బీఆర్ఎస్ నాయకులు సుదర్శన్‌గుప్తా ఉన్నారు.

## పంచాయతీ రికార్డులు సీజ్


రికార్డులను సీజ్ చేస్తున్న పంచాయతీరాజ్ అధికారులు

కేశంపేట, ఫిబ్రవరి 6: మండలంలోని సంగెం పంచాయతీ రికార్డులను డీఎల్‌పీవో మల్లారెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసి సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీవో కిష్టయ్యతో కలిసి పంచాయతీ రికార్డులను డీఎల్‌పీవో పరిశీలించారు. పంచాయతీ పరిధిలోని వెంచర్ల లేఅవుట్ విషయంలో అవకతవకలు జరుగుతున్నాయన్న ప్రచారం నేపథ్యంలో తనిఖీ చేయడం జరిగిందని, ఇకపై ఎలాంటి అనుమతులు ఇవ్వొవద్దని కార్యదర్శి సందీప్‌కు సూచించారు. గ్రామ పంచాయతీకి సంబంధించిన లేఅవుట్ రికార్డులను సీజ్ చేసినట్లు ప్రకటించారు.

## భర్త మృతిపై ఫిర్యాదు


వెంకటయ్య (ఫైల్)

మాడ్గుల, ఫిబ్రవరి 6: మండల పరిధిలోని మాడ్గుల గ్రామానికి చెందిన పల్లె వెంకటయ్య (45) గురువారం హైదరాబాద్‌లోని బడంగ్‌పేట్‌లో మృతి చెందారు. వెంకటయ్యకు ఇద్దరు భార్యలు, మొదటి భార్య సుజాతకు ఒక కూతురు, రెండో భార్య శైలజకు ఒక కమారుడు ఉన్నారు. గతంలో వెంకటయ్య మొదటి భార్యకు విడాకులు ఇచ్చారు. వెంకటయ్య రెండవ భార్యతో కలసి ఉండేవారు. వెంకటయ్య మృతదేహాన్ని మాడ్గుల గ్రామంలో దహన సంస్కారాలు చేసేందుకు కుటుంబ సభ్యులు తీసుకొచ్చారు. వెంకటయ్య మరణించినట్లు వార్త తెలిసిన మెదటి భార్య సుజాత మాడ్గుల పోలీస్‌స్టేషన్‌లో మృతిపై పలు అనుమానాలు ఉన్నాయంటూ ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కల్వకుర్తి ప్రభుత్వ దవాఖానకు పోలీసులు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని సీఐ వేణుగోపాల్‌రావు తెలిపారు.

## ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

కేశంపేట, ఫిబ్రవరి 6: అనారోగ్య సమస్యలతో బాధపడుతూ జీవితంపై విరక్తితో ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో చోటు చేసుకుంది. కేశంపేట సీఐ నరహరి తెలిపిన వివరాల ప్రకారం.. పాపిరెడ్డిగూడ గ్రామానికి చెందిన మంగలి జంగయ్య (45) కొందుర్గు మండలంలోని బీసీ వెల్ఫేర్ వసతిగృహంలో వంట మనిషిగా పని చేస్తున్నాడన్నారు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న జంగయ్య మూడు రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చి కుటుంబ సభ్యులతో అనారోగ్యం విషయమై చెప్పి మనోవేదనకు గురయ్యాడని పేర్కొన్నారు. ఈ నెల 5న రాత్రి ఇంట్లో ఎవరులేని సమయంలో జంగయ్య ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు జంగయ్యను పరిశీలించగా, అప్పటికే మృతి చెందాడని, పోస్టుమార్టంకోసం షాద్‌నగర్ కమ్యూనిటీ దవాఖానకు తరలించారన్నారు. మృతుడి కుమారుడు శ్రీనాథ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.